
# ఈసారైనా గ్యారంటీనా..?

- నామినేటెడ్ పదవులపై ఆసక్తి
- కూటమి నేతల భారీ ఆశలు
- ఇప్పటికే సీఎం వద్దకు జాబితా



పుట్టపర్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులపై అధికార పార్టీల నేతలు చాలా ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది రెండు విడుతల్లో నామినేటెడ్ పదవులు భర్తీ చేశారు. అందులో జిల్లాలోని నాయకులు కొందరికి రాష్ట్ర స్థాయి వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు దక్కాయి. తాజాగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాకు ప్రాతినిథ్యం దక్కలేదు. ఈనేపథ్యంలో రాష్ట్ర స్థాయి పదవులపై ఆశలు పెట్టుకున్న ఆశావహులకు నిరాశ కలిగింది. ఈనెలాఖరులోగా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని సీఎం చంద్రబాబు శుక్రవారం వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈసారి పదవి గ్యారెంటీ అన్న ఆశలు పలువురు నాయకుల్లో చిగురిస్తున్నాయి.

**రాజ్యసభపై పల్లె, గుండుమల కన్ను..!**

గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాన్ని కూటమి పార్టీలు గెలుచుకున్నాయి. అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు కోసం ప్రయత్నం చేసి దక్కని వారికి నామినేటెడ్ పదవుల ఆశలు చూపారు. పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, మడకశిర, కదిరి, ధర్మవరం నియోజక వర్గాల్లో చాలా మంది అధికార పార్టీ నేతలు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. జిల్లాలో రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులతోపాటు రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డులు, ప్రధాన ఆలయాల చైర్మన్ల పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పుట్టపర్తికి సంబంధించి పల్లె రఘునాథరెడ్డి రాజ్యసభ స్థానాలు ఆశిస్తున్నట్లు సమాచారం. ధర్మవరం నియోజకవర్గం నుంచి పరిటాల శ్రీరామ్ ఎమ్మెల్సీ రాష్ట్ర స్థాయిలో కీలకమైన ప్రాధాన్యం ఉన్న పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

**పొత్తు ధర్మం కోసం బీజేపీ, జనసేన ఎదురుచూపు**

మిత్ర ధర్మంలో భాగంగా వచ్చే పదవులపై కూటమిలో జనసేన, బీజేపీ నేతలు కీలక పదవులపై ఆశలు పెట్టున్నారు. ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో జనసేన, బీజేపీ నేతలు ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, తమ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రస్థాయిలో భర్తీ చేయని వడ్డెర, శాలివాహన, వక్కలిగ, వీరశైవలింగాయత్, పాల ఏకిరి, పట్ర కార్పొరేషన్ల చైర్మన్లు పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు జిల్లాకు దక్కే అవకాశాలున్నాయి. మార్కెట్ యార్డులు, ప్రధాన దేవాలయాలకు చైర్మన్లు, సభ్యులను నియమించే అవకాశం ఉంది. ఆయా నియోజక వర్గాల్లో మార్కెట్ , ఆలయ కమిటీ పాలక వర్గాల కోసం స్థానికంగా కూటమి పార్టీ శ్రేణుల్లో పోటీ నెలకొంది. ఇప్పటికే ఆయా నియోజక వర్గాల్లో మంత్రులు, శాసన సభ్యులు పదవులు ఆశించే నేతల జాబితాను సీఎం వద్దకు చేర్చారు. మరికొందరు నేరుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ వద్ద విన్నవించారు. జనసేన, బీజేపీ జిల్లా, రాష్ట్ర నేతల ద్వారా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నా నేతలు దరఖాస్తు చేశారు.

**పుడా దక్కేదెవరికో..?**

పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) చైర్మన్ గిరి ఎవరిని వరిస్తుందో అన్న ఉత్కంఠ జిల్లా కేంద్రంలో నెలకొంది. ఈ పదవి కోసం టీడీపీ నుంచే తీవ్ర పోటీ ఉంది. ఇందులో ప్రధానంగా వాల్మీకి సాధికార సమితి పార్లమెంట్ అధ్యక్షుడు బ్రహ్మణపల్లి రామాంజనేయులు, పుట్టపర్తికి చెందిన యువనేత గంధమనేని రామారావుతోపాటు తెలుగుయువత నాయకులు ఊరివాకిలి సురేష్‌నాయుడు, మరికొందరు టీడీపీ నేతలు పోటీపడుతున్నట్లు సమాచారం. చైర్మన్ పదవి తనకే ఇవ్వాలంటూ సురేష్‌నాయుడు పలుసార్లు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించారు. కూటమి మిత్ర ధర్మంలో అవకాశం వస్తే తమకు ఇవ్వాలని జనసేన, బీజేపీ నేతలు అడుగుతున్నారు. ప్రధానంగా రామాంజనేయులు, గంధమనేని రామారావు మధ్యనే చైర్మన్ పదవి కోసం పోటీ ఉన్నట్లు కూటమి పార్టీల్లో చర్చసాగుతోంది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిలు ఆశీస్సుల ఉన్న వారికే చైర్మన్ గిరి వరించే అవకాశం ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చసాగుతోంది.

## తొలిరోజు ప్రశాంతం

పది పరీక్షలకు 210 మంది గైర్హాజరు



ఎనుములపల్లిలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కొత్తచెరువు/పుట్టపర్తిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 104 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 21,393 మంది విద్యార్థులకుగాను 21,083 మంది పరీక్షలు రాశారు. 210 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అన్నారు. అయితే, కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాలలో 15 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నాపత్రాన్ని అందజేశారు. బదులుగా విద్యార్థులకు 15 నిమిషాల పరీక్ష సమయాన్ని పొడిగించారు.

- జిల్లా కేంద్రంలోని ఎనుములపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తాగునీరు, వైద్యశిబిరాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట డిపార్టుమెంట్ అధికారి జయసింహారావు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ తదితరులు ఉన్నారు.

## పద బాబూ.. పరీక్ష రాద్దువు..!



విద్యార్థిని మోసుకెళ్తున్న దృశ్యం

తాడిమర్రి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష రాసేందుకు స్థానిక ఉన్నతపాఠశాలకు విచ్చేసిన దివ్యాంగ విద్యార్థి మాంచుకు పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ అక్బర్‌తోపాటు అటెండర్ రమణ చేతల సాయం చేశారు. విద్యార్థి పరీక్ష కేంద్రం వద్దకు వచ్చేటప్పటికే సమయం అవుతుండటంతో వారు ఆ విద్యార్థిని తమ చేతులపై లోపలికి తీసుకెళ్లి పరీక్ష గది వద్ద వదిలి పెట్టారు. ఎలాంటి ఆలస్యం లేకుండా విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు.



## బాధ్యతలు చేపట్టిన ఐసీడీఎస్ పీడీ



నూతన పీడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సీడీపీఓలు

పుట్టపర్తి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీడీగా తోట శ్రీదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2008 సీడీపీఓ బ్యాచ్‌కు చెందిన ఆమె గుంటూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ జిల్లాకు వచ్చారు. ఇన్‌చార్జి పీడీగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అంతకుమునుపు కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జిగా ఉంటున్న ఓడీ చెరువు సీడీపీఓ వరలక్ష్మి తిరిగి తన మాతృసంస్థకు వెళ్లారు.

## అర్జీలను సకాలంలో పరిష్కరించండి

- కలెక్టర్ టీఎస్ చేతన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలిచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశం భవనంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్ని ప్రజల నుంచి 234 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్య లపై ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకి అధికారులు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. సమాజంలో 20శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి పీ4 విధానం అమలు చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు తమ అభిప్రాయాలను ఈనెల 25లోపు తెలియచేయాలన్నారు. తనకల్లు, ధర్మవరం మండలాల్లో రైతు నమోదు ప్రక్రియ నత్తనడకన జరుగుతోందని ఆయా మండలాల తహసీల్దార్లు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథి, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో సువర్ణ, సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర, డీఎఫ్ఓ చక్రపాణి, పరిశ్రమశాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, డీసీహెచ్ఓ తిపేంద్రనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మల్లికార్జునయ్య, మున్సిపల్ కమిషన్ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి ఎద్దడి రాకూడదు**

పుట్టపర్తిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, వడగాడ్పులు, పీ4 సర్వే, భూముల రీసర్వే, పీజీఆర్ఎస్ అర్జీలపై జిల్లాలోని ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న వేసవిలో ఎండలు తీవ్రంగా ఉంటాయని, విపత్తుల నిర్వహణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీపీఓ సమత పాల్గొన్నారు.



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న సిరివల్లి, వర్షిత్

## అమ్మా..! అందుకేనా నాన్న రాలేదు?

తాడిమర్రి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తండ్రి చనిపోయాడన్న విషయం ఆ విద్యార్థికి తెలియదు. బంధువులు, పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచింది. ఈక్రమంలో ఆ అమ్మాయి ఉత్సాహంగా పరీక్షలు రాయడానికి సోమవారం ఉదయం వెళ్లింది. ఆమె మనసు మాత్రం ఏదో కీడు శంకించింది. పబ్లిక్ పరీక్షలు రాస్తుంటే ధైర్యం చెప్పడానికి తన తండ్రి ఎందుకు రాలేదని కొంచెం కంగారు పడింది. ఏదో పని ఉండి రాలేదేమో అని తనకు తానే సర్ది చెప్పుకుంది. పరీక్ష ముగిసిన తర్వాత విషయం తెలిసి బోరున విలపించింది. ఇంటికెళ్లి తండ్రి శవాన్ని చూసి తల్లిని పట్టుకుని గుండెలవిసేలా రోదించి, సొమ్మసిల్లింది. ఇందుకేనా అమ్మా.. నాన్న ఎగ్జామ్ సెంటర్ వద్దకు రాలేదు అని ఆమె విలపించడం అక్కడున్న వారిని కంట తడి పెట్టించింది. ఇది తాడిమర్రి మండలం తురకవారిపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి సిరివల్లి వ్యథ. ఈ బాలిక అనంతపురంలో హాస్టల్లో ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. ఈమె తండ్రి టీడీపీ నాయకుడు తమ్మినేని రమేశ్‌నాయుడు ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే పది పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు సిరివల్లికి తెలియకుండా గోప్యంగా ఉంచారు.

## మహిళల భద్రతకు ప్రాధాన్యం: ఎస్పీ

శక్తి బృందాల వాహనాలు ప్రారంభం



శక్తి వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, వారి కోసం జిల్లాలో ఆరు శక్తి బృందాలను రంగంలోకి దింపామని ఎస్పీ వి.రత్న అన్నారు. 'శక్తి.. మీ రక్షణ మా కర్తవ్యం' అనే నినాదంతో రూపొందించిన ద్విచక్రవాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె ప్రారంభించారు. శాంతి కపోతాలను ఎగురవేసి, స్వేచ్ఛచైతన్యం, భద్రత నినాదంతో శక్తి బృందాలు పనిచేయాలని సూచించారు. శక్తి బృందాలు 24 గంటలు విధి నిర్వహణలో ఉంటాయని తెలిపారు. బాలికలు, మహిళలు ఆపదలో ఉన్నప్పుడు సకాలంలో స్పందిస్తాయని అన్నారు. ఆపద సమయంలో శక్తియాప్ నుంచి వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్‌కు స్పందించి.. సంఘటనా స్థలానికి శక్తి టీంలు తక్షణమే వెళతాయని అన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి బదిలీల కౌన్సెలింగ్

పుట్టపర్తి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ సిబ్బంది బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ పథకం పీడీ విజయేంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల నుంచి ఐదేళ్లు ఒకే చోట పూర్తి చేసుకున్న సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహి స్తామన్నారు. ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టెక్నికల్ అసిస్టెంట్లకు, 19న కంప్యూటర్ ఆపరేటర్లకు, 20న అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లకు ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, జూనియర్ ఇంజనీర్లకు, మధ్యాహ్నం 12గంటల నుంచి 2 గంటల వరకు, మిగిలిన సిబ్బందికి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ : 6.34 (మంగళవారం సాయంత్రం)
సెహరీ : 5.03 (బుధవారం ఉదయం)

ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 38.0 కనిష్ఠం : 24.0

# బిరబిరా.. కృష్ణమ్మ...!

నెల రోజుల్లో మడకశిరకు కృష్ణా జలాలు

రెండేళ్లుగా నీటి కోసం రైతన్నల ఎదురుచూపు

**చెరువులను నింపాలి**



ఎలాంటి సాగు నీటి వనరులు లేని మడకశిర ప్రాంతంలో ఉన్న చెరువులన్నీ నింపాలి. వర్షాల కురవని సమయంలో పండ్ల తోటలు, ఇతర పంటలను కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్యాంకర్ల ద్వారా పంటలకు నీటి తడులు అందించాల్సి వస్తోంది. కృష్ణా నీటితో చెరువులను నింపితే భూగర్భజల మట్టం పెరిగి పుష్కలంగా నీరు దొరుకుతాయి. పూర్తి స్థాయిలో పంటలు సాగు చేయవచ్చు. - రైతు రమేష్, కోడిపల్లి




మరో నెల రోజుల్లో మడకశిర ప్రాంతంలో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతాయని అధికారులు చెబుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు గత నెలలో నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పెనుకొండ మీదుగా హిందూపురం, తరువాత మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణా జలాలు చేరనున్నాయి. ప్రస్తుతం పెనుకొండ సమీపంలోని రాచపల్లికి ప్రాంతానికి కృష్ణా జలాలు వచ్చాయి. మరో రెండు మూడు రోజుల్లో హిందూపురం ప్రాంతంలోని చెరువులకు నీరు చేరనుంది. నెల రోజుల తరువాత మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణా జలాలు చేరుతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీనిపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో 20 రోజుల కిందట 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నీటిలో 80శాతం మూడు నియోజకవర్గాల్లోని అన్ని చెరువులకు అందించనున్నారు.

- ఆంధ్రజ్యోతి, మడకశిర

**120 చెరువులు నింపాలి**

నియోజకవర్గంలో ఉన్న 120 చెరువులను కృష్ణా జలాలతో నింపాల్సి ఉంది. ఇందులో ఇరిగేషన్ పరిధిలో 47 పెద్ద చెరువులు ఉన్నాయి. చిన్న చిన్న చెరువులు, కుంటలు 73 దాకా ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు ఐదు చెరువులకే నీరు చేరాయి. ప్రతి ఏటా కృష్ణమ్మ నీటికోసం అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ఐదేళ్ల కిందట టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తొలిసారి కృష్ణా జలాలతో మడకశిర ప్రాంతంలో నాలుగు చెరువులను నింపారు. రెండేళ్ల కిందట ఐదు చెరువులను నింపారు. ఇక అప్పటి నుంచి ఒక్క చెరువూ నింపలేదు. ఈ ఏడాదైనా అన్ని చెరువులను నింపాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



**వర్షాధార పంటలే సాగు..**

మడకశిరకు నీటి వనరుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఈ ప్రాంత రైతులు చాలా చోట్ల వర్షం ఆధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు బాగా కురిసి చెరువులకు నీరు చేరితేనే బోరుబావుల్లో నీరు సమృద్ధిగా ఉంటాయి. వర్షాలు కురవకపోతే భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కూడా కటకటలాడే పరిస్థితి నెలకొంటుంది. కొన్ని ప్రాంతాల్లో 1000 అడుగులు తవ్వించిన నీటి చెమ్మ దొరకని పరిస్థితి నెలకొంటుంది. అందుకే కృష్ణా జలాలతో చెరువులు నిండితే నీటి సమస్య తొలగుతుందని వారు చెబుతున్నారు.



అడుగంటుతున్న మడకశిర ప్రాంతంలోని చెరువు

**నెల రోజుల్లో కృష్ణాజలాలు**

కృష్ణానది జలాలు మడకశిర బ్రాంచి కెనాల్‌కు వదిలి 28 రోజులు అవుతుంది. ప్రస్తుతానికి పెనుకుండ ప్రాంతంలోని రాచపల్లి కి చేరాయి, అక్కడ నుంచి రెండు రోజులలో హిందూపురం చేరుతాయి. అక్కడ నుంచి నెల రోజులలో మడకశిర ప్రాంతంలోని చెరువులకు చేరుతాయి. పెనుకొండలో 12 చెరువులు నిండాయి. మడకశిర ప్రాంతానికి కూడా 28 రోజులు పాటు నీరు వచ్చేలా కేటాయింపులు జరిగాయి. ఈ 28 రోజులలో ఎన్ని చెరువులు వీలైతే అన్ని చెరువులను నీటితో నింపుతాం.

-నాగార్జున, ఏఈ, హెచ్ఎన్ఎస్

# కళాశాల..!

కణేకల్లు వెనుకబడిన ప్రాంతం. పేదలు, కూలీలు అధికంగా నివాసం ఉంటున్నారు. పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించే స్థోమత చాలామందికి లేదు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. కణేకల్లులో జూనియర్ కళాశాల ఉండడంతో పంపుతున్నారు. ఆ పైచదువులకు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. డిగ్రీ చదవాలంటే రాయదుర్గమో, ఉరవకొండో వెళ్లాల్సి వస్తోంది. రోజూ పిల్లలను కళాశాలకు పంపడం తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతోంది. దీంతో చదువు మధ్యలోనే మాన్పించేస్తున్నారు. విద్యార్థినుల పరిస్థితి చెప్పక్కర్లేదు. చాలామంది ఇంటర్మీడియట్‌తోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే.. తాము చదువుకోగలమని విద్యార్థులు ఏళ్లుగా కోరుతున్నారు. డిగ్రీ కళాశాల వారి దశాబ్దాల కల. అందుకోసం ఈ ప్రాంతవాసులు ఉద్యమాలు కూడా చేపట్టారు. దశాబ్దాల కల సాకారం కాబోతోంది. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానన్న ఎన్నికల హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారు. ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే కళాశాల నిర్మాణానికి ఉన్నతాధికారులు స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక భవనాల్లో వచ్చే విద్యా సంవత్సరమే డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

- ఆంధ్రజ్యోతి, కణేకల్లు

### 43 ఏళ్ల కల..

కణేకల్లులో 1982లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ చదివిన విద్యార్థులు పైచదువులకు రాయదుర్గం, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దూర ప్రాంతాలకు వెళ్లి డిగ్రీ చదివే స్థోమత లేక చాలామంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసేవారు. దీంతో 43 ఏళ్లుగా డిగ్రీ కళాశాల కోసం ఇక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)



### హామీ ఇచ్చారు.. నెరవేరుస్తున్నారు..

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కణేకల్లుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు స్థానికులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అందుకు ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటవడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

### 700 మంది విద్యార్థులకు ఉపయోగం

కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు దాదాపు 700 మంది విద్యార్థులకు ఉపయోగకరం. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీల్లో చదివే విద్యార్థులకు ప్రయోజనకరం. ఇప్పటికే కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 250 మంది, బొమ్మనహాళ్‌లో 230 మంది, కణేకల్లు మోడల్ స్కూల్‌లో 38 మంది, కేజీబీవీలో 30 మంది చదువుతున్నారు. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉండడంతో వీరంతా కణేకల్లులో డిగ్రీ కాలేజీ నిర్మిస్తే అందులో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.

### బాలికల్లో ఉత్సాహం

కణేకల్లులో వచ్చే విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాల ప్రారంభం అవుతుందని తెలియడంతో బాలికల్లో ఉత్తేజం నెలకొంది. కణేకల్లులో ఇంటర్ పూర్తి చేసుకున్న తర్వాత అనేకమంది గ్రామీణ విద్యార్థినులు డిగ్రీ చదవాలంటే రాయదుర్గం, ఉరవకొండకు వెళ్లాల్సి వచ్చేది. ఆయా గ్రామాల నుంచి విద్యార్థినులు కణేకల్లుకు చేరుకుని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలి. దీంతో చాలా మంది విద్యార్థినులు చదువును మధ్యలోనే మానేయాల్సి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా రోజూ తమ పిల్లలను 60 కి.మీ. దూరం పంపాల్సి వస్తుండడంతో ఆసక్తి చూపేవారు కాదు. కణేకల్లులోనే డిగ్రీ కళాశాల ప్రారంభవుతున్న నేపథ్యంలో బాలికల్లో డిగ్రీపై ఆశలు పెరిగాయి.

### విద్యాభివృద్ధికి పెద్దపీట



వెనుకబడిన ప్రాంతమైన రాయదుర్గం నియోజకవర్గంలో విద్యతోనే అభివృద్ధి సాధ్యం. కావున నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అందులో భాగంలో కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నాం. అది నేటికి సాకారం అయింది. వచ్చే ఏడాది నుంచే విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో చాలా సంతోషంగా ఉంది.

-కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్

### ఉన్నత చదువులకు అవకాశం



నేను రోజూ స్వగ్రామం బ్రహ్మసముద్రం నుంచి కణేకల్లుకు 10 కి.మీ. దూరం వచ్చి ఇంటర్ చదువుతున్నా. డిగ్రీ చదవాలంటే రాయదుర్గం, ఉరవకొండకు వెళ్లాలి. రోజూ స్వగ్రామం నుంచి కణేకల్లుకు వచ్చి, ఇక్కడి నుంచి మరలా ఆ ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందే. డిగ్రీ అసాధ్యమనుకున్నా. కణేకల్లులోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడంతో ఉన్నత చదువులపై ఆశలు రేగాయి.

-వహీదా, ఇంటర్ విద్యార్థిని, బ్రహ్మసముద్రం

### మంచి అవకాశం



కణేకల్లులో అనేక మంది పేద, మధ్యతరగతి బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్ పూర్తికాగానే చదువులు సందిగ్ధంలో పడేవి. ప్రస్తుతం డిగ్రీ కళాశాల ఏర్పాటవుతుండడం బాలికలకు మంచి అవకాశంగా భావిస్తున్నాం.

-వర్షిత, ఇంటర్ విద్యార్థిని, బెణెకల్లు

### శుభ సూచకం..



కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుండడం శుభ సూచకం. మా కాలేజీలో దాదాపు 552 మంది ఇంటర్ చదువుతున్నారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఏటా పలువురు విద్యార్థులు ఇంటర్ పూర్తి కాగానే చదువు మానేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఇంటర్ విద్యార్థులంతా చేరే అవకాశం ఉంది. ఉన్నత చదువులతో వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

- ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కణేకల్లు

# యథేచ్ఛగా జలచౌర్యం

- పట్టించుకోని అధికారులు
- అడుగంటుతున్న బీటీపీ
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు



బీటీపీ కాలువ నుంచి పైపుల ద్వారా జలచౌర్యం

గుమ్మఘట్ట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సాగునీటి సరఫరాపై అధికారుల నిఘా, నియంత్రణ లేకపోవడంతో ముందు భాగంలో ఉన్న కొందరు రైతులు అనధికారికంగా వాడుకుంటూ జలచౌర్యానికి పాల్పడుతున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులు పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గుమ్మఘట్ట మండలంలోని భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు (బీటీపీ)కు గత ఏడాది వర్షాలకు పూర్తిగా వర్షపునీరు చేరింది. దీంతో కుడి, ఎడమ కాలువల కింద 4,800 ఎకరాలకు సాగునీటిని అందించారు. ఆయకట్టులో వరి, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఎడమ కాలువ కింద 14వ డిస్ట్రిబ్యూటరీ నుంచి చివరి ఆయకట్టు దాకా 3,800 ఎకరాలు, కుడి కాలువ కింద చివరి ఆయకట్టుకు రెండు వేల ఎకరాల దాకా సాగునీరు విడుదల చేయడంతో పంటలు సాగుచేశారు. ముందు భాగంలో రైతులు సాగునీటిని అనధికారికంగా వాడుకుంటుండడంతో చివరి ఆయకట్టులో అధికారికంగా సాగుచేసిన రైతులకు సాగు ప్రశ్నార్థకమవుతోంది. రోజురోజుకు వేసవి ఎండలతో రిజర్వాయర్‌లో నీరు అడుగంటి పోతోంది. గతంలో ఇరిగేషన్ అధికారులు డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఆయకట్టుకు కావాల్సినంత నీటిని మాత్రమే విడుదల చేస్తూ ఎప్పటికపుడు పర్యవేక్షించేవారు. మూడునెలలుగా వారి పర్యవేక్షణ కొరవడింది. దీంతో కొంతమంది రైతులు ఎడమ కాలువలో అక్రమంగా పైపులు వేసి 30 దాకా మోటార్ల ద్వారా కాలువ నీటిని జలచౌర్యం చేస్తున్నారు. నియంత్రించాల్సిన ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కొంతమంది ఇష్టారాజ్యంగా సాగునీటిని వృథాగా హగరికి వదులుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు ఆయకట్టు పంట సాగుచేస్తున్న రైతుల పంటలకు సాగునీరు సరిపడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఆయకట్టు రైతులకు నాలుగునెలలు సాగునీరు అందించాలి. నీరు చేరడంలో ఆలస్యం కావడంతో పంటల సాగు జాప్యమవుతోంది. మరో రెండు నెలలు సాగునీరు ఇస్తే తప్ప పంట చేతికందడం కష్టం. వేసవి ఎండలతో అడుగంటడంతో ఉన్న నీటిని రైతులకు అందించడం కష్టతరంగా మారుతున్నట్లు సాగునీటి సంఘం సభ్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటిని పొదుపుగా వాడుకోకపోతే ఇబ్బందులు తప్పవంటున్నారు. కొంతమంది రైతులు జలచౌర్యానికి పాల్పడుతూ అనధికారికంగా దాదాపు 200 ఎకరాలలో వరిపంట సాగుచేశారు. బీటీపీ నుంచి గుమ్మఘట్ట కేవీ ట్యాంక్ వరకు సాగునీటిని అక్రమంగా వాడుకుంటున్నా పట్టించుకునే వారు లేరు.



గుమ్మఘట్ట వద్ద అనధికారికంగా సాగుచేసిన వరిపంట

### జలచౌర్యాన్ని అరికట్టాలి



గ్రామాల ప్రజలు, ప్రధాన కాలువలో కొంతమంది రైతులు పైపుల ద్వారా జలచౌర్యం చేస్తున్నారు. అధికారులు అరికట్టి ఆయకట్టు రైతులను కాపాడాలి. గతంలో ఇరిగేషన్ అధికారులు కాలువగట్లపై తిరుగుతూ నీటిని పొదుపుగా అందించేవారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాగునీరు ఇష్టారాజ్యంగా అక్రమ వాడకం జరుగుతోంది.

-గంగప్ప, ఆయకట్టు రైతు, కలుగోడు

### చెరువుకు నీరు వదలండి



కలుగోడు ఎడమ కాలువ పరిధిలోని కలుగోడుచెరువు నీరులేక అడుగంటి పోయింది. ఈ చెరువు పరిధిలో మూడు గ్రామాలు తాగునీటి పథకాల బోరుబావులు అడుగంటి పోతున్నాయి. వేసవిలో తాగునీటి కోసం చెరువును బీటీపీ నీటితో నింపాలి. గతంలో పాలకులు చెరువును నీటితో నింపుతామని హామీ ఇచ్చి విస్మరించారు.

- రామాంజనేయులు, సీపీఐ నాయకుడు



### ఆయకట్టును కాపాడుతాం



బీటీపీ కింద సాగు చేసుకున్న పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందిస్తాం. గతంలో లస్కర్లు ఉండడంతో సాగునీరు వృథా కాకుండా కాపాడేవాళ్లం. ప్రస్తుతం పై భాగంలో కొంతమంది రాత్రివేళల్లో జలచౌర్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా గ్రామాల్లో వారిని హెచ్చరించాం. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ లోపంతో కొంతనీరు వృథాగా పోతున్న మాట వాస్తవమే. ఆయకట్టుకు పంటలు నష్టపోకుండా కాపాడుతాం.

- కాలవ నాగరాజు, బీటీపీ సాగునీటి సంఘం చైర్మన్

# అధికారి తీరుతో హడల్..!

- సార్‌కు కోపం వస్తే టీ కప్పులు, సాసర్లు పగలాల్సిందే...
- ప్రజాసమస్యలపై కొర్రీలు... భయపడిపోతున్న సిబ్బంది
- కళ్యాణదుర్గంలోని ఓ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు



కళ్యాణదుర్గం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకమైన ఆ అధికారి తీరుతో అటు సిబ్బంది, ఇటు జనం హడలెత్తిపోతున్నారు. ప్రతి పనికీ కొర్రీలు వేస్తూ.. తిప్పుకుంటుండడంతో జనం బేజారవుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఆ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సార్‌కు కోపం వస్తే టీ కప్పులు, సాసర్లు పగిలిపోవాల్సిందేనని.. ఆయన తీరుపై కిందిస్థాయి సిబ్బంది హడలెత్తిపోతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక సిబ్బంది నలిగిపోతున్నారు. దీంతో కీలకమైన ఆ శాఖలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారమవుతాయని జనం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఆ అధికారి ప్రతి సమస్యకు ఏదో ఒక సాకు చెబుతూ పనులు చేయకుండా వాయిదాలు వేస్తున్నారు. ఆయన నిర్వాకం వల్ల ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. ప్రజాప్రతినిధులు కూడా ఆ అధికారి తీరుపై మండిపడుతున్నారు. ఆ అధికారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్క పనీ ముందుకు సాగలేదు. గత కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి. సిబ్బంది కూడా ఆ అధికారికి ఈ పని ఉంది పూర్తి చేయాలని చెప్పడానికి భయపడుతున్నారు. సిబ్బందిపై నిత్యం చిందులు వేస్తుండడంతో వారు భయపడిపోతున్నారు. ఆ అధికారిని పలకరించే సాహసం కూడా చేయలేకపోతున్నారు. కొంతమంది సిబ్బంది మౌనంగా తమ విధులు నిర్వహించుకుంటూ వెళ్లిపోతున్నారు. ఆ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడుతుండడంతో కిందిస్థాయి సిబ్బంది నెలనెలా జీతం తీసుకున్నామా...విధులు నిర్వహించామా...వెళ్లామా అన్న రీతిలోనే కొనసాగుతున్నారు. దీంతో ఆ శాఖ వ్యవస్థ మూలనపడిపోయింది. సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ శాఖ పరిధిలో పనులన్నీ సాఫీగా సాగిపోయేవి. కానీ ప్రస్తుతం ముఖ్యమైన అధికారి తీరుతో పనులన్నీ పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఆ అధికారి తీరుతో ఆ శాఖ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఐదేళ్ల నుంచి వేచి చూసినప్పటికీ ఏ మాత్రం ప్రయోజనం లేదని.. ఇప్పుడు కూడా తమ పనులు కావడం లేదని అధికార పార్టీ నాయకులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారుల మౌనమెందుకో..?

కీలకమైన అధికారి తీరుపై ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా మౌనం వహించడం విమర్శలకు దారితీస్తోంది. పరిస్థితిని సమీక్షించకుండా, గాడినపెట్టకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అన్న వాదనలు వినిపిస్తున్నాయి. పాలన ఎలా ఉంది, ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయా లేదా అన్న విషయాలను కూడా తెలుసుకోవడంలో ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పుడంతా కంప్యూటర్ పాలన సాగుతోంది. ఆ శాఖ ప్రగతిని తెలుసుకునే వెసులుబాటు ఉంది. కానీ, ఉన్నతాధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

## పీడియాట్రిక్ సర్జన్ వార్డు ప్రారంభం

అనంతపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చిన్నపిల్లల శస్త్ర చికిత్స వార్డును జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు సోమవారం ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి సోమ, బుధవారాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పీడియాట్రిక్ ఓపీ సేవలు ఉంటాయని తెలిపారు. చిన్నారులకు ఇక్కడే సర్జరీలు చేస్తామని తెలిపారు.

## ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్య కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా భక్తవత్సలం, కార్యదర్శిగా శివశంకర్

అనంతపురం సెంట్రల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో, ఎస్కేయూ అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా భక్తవత్సలం, ఉపాధ్యక్షుడిగా కేబీ చౌదరి, కార్యదర్శిగా శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సుబ్బారావు, వనజ, బసయ్య, రామును ఎన్నుకున్నారు. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను సకాలంలో నిర్వహించకపోవడంతో గతంలో అడ్మిషన్ల శాతం పూర్తిగా పడిపోయిందని నూతన అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు. కళాశాలల ఫీజులు తగ్గింపు, తల్లుల ఖాతాలకే ఫీజు రీయింబర్స్‌మెంట్, ల్యాబ్‌ల నిర్వహణ, ఆలస్యంగా ఫలితాలు విడుదల, క్రీడల నిర్వహణ ఇలా అనేక అంశాలతో కళాశాలలు మూసివేతదశకు చేరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో సకాలంలో ప్రవేశాలు కల్పించేలా ప్రభుత్వం చొరవచూపుతోందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలలకే చెల్లించి, విద్యార్థులకు సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని అన్నారు.



నూతన కార్యవర్గం

# అలా.. బిల్లులు.. ఇలా.. చెల్లింపులు..

చంద్రబాబు పాలనలో ఎప్పటికప్పుడు డైట్ బిల్లుల విడుదల.. ప్రతినెలా వేతనాలు...

వార్డెన్లు, అధికారుల హర్షం



భోజనం కోసం లైన్లో ఉన్న విద్యార్థులు (ఫైల్)



కొత్త ప్రభుత్వం వచ్చాక డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుండడంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు కూడా పెండింగ్ లేకుండా క్లియర్ ఇచ్చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో వార్డెన్లు పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో డైట్ బిల్లులు అందక, జీతాలు పడక ఆర్థిక కష్టాలు భరించారు. వడ్డీలకు అప్పులు తెచ్చి ఓ వైపు కుటుంబాన్ని... మరోవైపు వసతిగృహాల విద్యార్థులకు డైట్ అమలు చేసేందుకు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వార్డెన్లకు నెలనెలా జీతాలు సమయానికి చెల్లించడంతోపాటు... డైట్ బిల్లులను సకాలంలో విడుదల చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే జనవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. డిసెంబరు నెల వరకూ బిల్లులను క్లియర్ చేసింది. దీంతో సంక్షేమశాఖల అధికారులతోపాటు... వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

### టోటల్ క్లియర్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. తొలుత ఆయా వసతిగృహాలకు ఆగస్టు నుంచి బిల్లులు పెండింగ్‌లో పడిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.13 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో... రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన బిల్లులను మంజూరు చేసింది. ఆ తర్వాత అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన డైట్ బిల్లులను విడుదల చేసింది. దీంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు ఆనందంలో మునిగి తేలుతున్నారు. గత వైసీపీ హయాంలో ఆరేడు నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండేవనీ, విద్యార్థులకు డైట్ అమలు చేసేందుకు అప్పులు చేసేవాళ్లమని వాపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పట్నుంచి రెండు నెలలకు మించి బిల్లులు పెండింగ్‌లో ఉంచడం లేదని చెబుతున్నారు. ఒకవేళ పెండింగ్ పెట్టినా.. అన్నీ ఒకేసారి క్లియర్ చేస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### బడ్జెట్ ఉంది... త్వరలోనే క్లియర్ అవుతాయి



గతేడాది డిసెంబరు పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ వసతిగృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు క్లియర్ చేశాం. ప్రస్తుతం జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి బిల్లుల ప్రతిపాదనలు పంపాం. బడ్జెట్ కూడా ఉంది. ట్రెజరీలోకూడా బిల్లులు పాసయ్యాయి. త్వరలోనే బిల్లులు పడుతాయి.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ

### ప్రతిపాదనలు పంపాం...

జిల్లాలోని ప్రీమెట్రిక్ వసతగృహాలకు గతేడాది డిసెంబరు వరకూ బిల్లులు క్లియర్ అయ్యాయి. పోస్ట్‌మెట్రిక్ సంబంధించి సెప్టెంబరు వరకూ విడుదలయ్యాయ్యాయి. పెండింగ్ బిల్లులకు సంబంధించిన ప్రతిపాదనలు అడిగారు. ఇప్పటికే ఆ ప్రతిపాదనలు పంపాం. వారంలోపు నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

-కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

# రాలుతున్న ఆశలు..!

## మామిడి రైతుకు దిగుబడి దిగులు

- చెట్లలో రాలిపోతున్న పూత
- పిందెలు నేలపాలు
- కనిపించని ఉద్యాన శాఖాధికారులు

బొమ్మనహాళ్, మార్చి17(ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక మామిడి చెట్లలో పూత నెలరోజులు ఆలస్యంగా వచ్చింది. పూత బాగా రావడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు సంబరపడ్డారు. ఉన్నఫలంగా పూత మొత్తం రాలిపోతోంది. పిందెలు కూడా నిల వట్లేదు. ఆశల పంట కళ్లెదుటే నేల రాలుతుంటే రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పూతను నిలబెట్టుకునే మార్గం తెలియక దిక్కులు చూస్తున్నారు. పెట్టుబడి కూడా దక్కదనీ, తీవ్ర నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సలహాలివ్వాల్సిన ఉద్యానవన శాఖాధికారులు పొలాల వద్దకు కూడా రావట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఫర్టిలైజర్స్ దుకాణ దారులిచ్చే మందులు పిచికారీ చేస్తూ.. రైతులు మరింత నష్టపోతున్నారు.

### ఎకరాకి రూ.50 వేలు పెట్టుబడి

మండలంలోని కల్లుదేవనహళ్లి, బండూరు, ఉంతకల్లు, కొళగానహళ్లి తదితర గ్రామాల్లో మామిడి సాగు చేశారు. ఏటా పంట సాగు చేసే రైతులు పెరుగుతున్నారు. కూలీలు, మందులు తదితర వాటికి సుమారుగా రైతులు ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేసుకున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ఏమాత్రం అనుకూలించట్లేదు. సాధారణంగా డిసెంబరులో రావాల్సిన పూత నెలరోజులు ఆలస్యంగా వచ్చింది. అయినా.. పూత నిండుగా రావడంతో రైతులు సంబరపడ్డారు. దిగుబడి ఆశాజనకంగా వస్తుందని ఆశించారు. తర్వాత పూత రాలడం మొదలెట్టింది. వచ్చిన పూత వచ్చినట్లుగానే రాలిపోతోంది. పిందెలు కూడా నేల రాలుతున్నాయి. చెట్లలో కాడలు మాత్రం కనిపిస్తున్నాయి. కళ్ల ముందే పూత, పిందెలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటలకు ఎరువులు వేసినా.. పెద్దగా ఫలితంలేదని రైతులు తెలిపారు. నష్టాలు తప్పవని వారు ఆవేదన చెందుతున్నారు. పూత, పిందెలను కాపాడుకునేందుకు రైతులు పలురకాల మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా ప్రయోజనం దక్కట్లేదు. పెట్టుబడి మరింత పెరుగుతోంది. ఉద్యాన శాఖాధికారులు.. తోటల వైపు కూడా చూడట్లేదని రైతులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యాన శాఖాధికారులు రాయదుర్గంలో ఉంటున్నారు. దీంతో తోటలను సందర్శించి, రైతులకు సరైన సమయంలో సలహాలు ఇచ్చేవారు కరవయ్యారు.


కల్లుదేవనహళ్లి వద్ద సాగు చేసిన మామిడి తోట


రాలి పోయిన పిందెలు

### తోటలోకి వెళ్తే బాధేస్తోంది

మామిడి పూత, పిందెలు రాలుతున్నాయి. మందులు పిచికారీ చేస్తున్నా పూత నిలవడం లేదు. పిందెలు రాలడం చూసి తోటలోకి వెళితే బాధవుతోంది.

- ఖలంధర్, రైతు, గోవిందవాడ

### అవగాహన కల్పించాలి

మామిడి సాగును ప్రభుత్వాలు పోత్సహిస్తున్నాయి. పంట సాగుపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించేవారు కరువయ్యారు.

- సికిందర్, రైతు, ఉంతకల్లు

### పిల్ల పురుగులు ఆశించడంతోనే..

మామిడి చెట్లకు పిల్ల పురుగులు ఆశించడంతోనే పూత, పిందెలు రాలుతున్నాయి. చిగుర్లు ఏర్పడే సమయంలో పిల్ల పురుగులు ఆకులపై చేరి గోకి రసాన్ని పీల్చుతాయి. తద్వారా పూత, చిగుర్లు, ఆకులు చిన్నవిగా మారి రాలిపోతాయి. పిందె ఏర్పడే సమయంలో తోలుపై గోకి రసాన్ని పీలుస్తాయి. కావున పిందెలు కూడా రాలుతాయి. పురుగుల ఆశించిన కాయలపై మంగు ఏర్పడి, నాణ్యత దెబ్బతింటుంది. కాయలకు రక్షణ కవచం ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ పురుగు నుంచి రక్షణ కల్పించవచ్చు. పురుగుల ఉధృతి మరీ ఎక్కువగా ఉంటే అసిఫేట్ 75 గ్రాములు.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పురుగు తగ్గకపోతే 15.. 20 రోజుల తర్వాత ఫిప్రోనెల్ 5 ఎస్.సి. 2 ఎం.ఎల్.. లీటరు నీటిలో కలిపిగానీ, సైనసైడ్ 45 ఎస్.పి. 0.3 ఎం.ఎల్. లీటరు నీటిలో కలిపిగానీ పిచికారీ చేసుకోవాలి.

- మౌనిక, ఉద్యాన శాఖాధికారి, రాయదుర్గం


మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు

# సమ్మోహన రూపం

- మోహినీ రూపంలో దర్శనమిచ్చిన ఖాద్రీశుడు
- శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మైమరపించే సోయగాలతో, చంకన అమృతభాండాగారంతో మోహన రూపుడైన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులు సందడిగా మారాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నారసింహుడు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాలలో నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యా సమయంలో మోహినీ అలంకారాన్ని గావించారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని రోజుల్లోనూ శ్రీవారు తిరువీధుల్లో మాత్రమే విహరిస్తారు. అయితే మోహినీ ఉత్సవం రోజు కోరిన భక్తుడి ఇంటికి వెళ్లి దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి ఆలయం నుంచి బయలుదేరిన శ్రీవారు తిరిగి ఆలయప్రవేశం గావించేది మంగళవారం మధ్యాహ్నానికే. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### నేడు ప్రజా గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీలక్ష్మీనారసింహుడు మంగళవారం ప్రజా గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిత్యపూజ , హోమం అనంతరం గ్రామ సేవ నిర్వహిస్తారు. సంధ్యాసమయంలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. అదేమంటే బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే ఓమారు గరుడ సేవను నిర్వహించినా మళ్లీ ప్రజల కోరిక మేరకు గరుడ సేవను నిర్వహిస్తారు. అందుకే దీన్ని ప్రజా గరుడ సేవ అని పిలుస్తారు.


హాజరైన భక్తులు

## బ్రహ్మోత్సవాల్లో కొక్కంటి పాలేగాళ్ల జ్యోతి

తనకల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కొక్కంటి పాలెగాళ్ల జ్యోతికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఉత్సవాల్లో భాగంగా కదిరి పున్నమి నుంచి తీర్థవాది వరకు రోజూ తిరువీధుల్లో నిర్వహించే స్వామి వారి ఊరేగింపును ఈ జ్యోతి ముందుండి నడిపిస్తుంది. పది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చును మొత్తం కొక్కంటి పాలేగాళ్ల వైవి. దినకర్‌ప్రసాద్ నాయుడు భరిస్తున్నారు. తరతరాలుగా తమ వంశస్తులకు ఈ గౌరవం దక్కడం తమ అదృష్టమని ఆయన తెలిపారు.


బ్రహ్మోత్సవాల్లో ముందున్న కొక్కంటి జ్యోతి

## నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాక

అనంతపురం కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మంగళవారం జిల్లాకు వస్తున్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్య యాత్రల్లో భాగంగా ఆయన అనంతపురం రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నల్లప్ప సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తాడిపత్రి ప్రాంతంలో సోలార్ ఎనర్జీ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడతారని వివరించారు.

## తాగునీటికి రూ.115 కోట్లు

- తీరనున్న పుట్టపర్తి ప్రజల దాహార్తి

పుట్టపర్తి టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మున్సిపాలిటీ సమగ్ర తాగు నీటి పథకానికి రూ.115 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం సాయంత్రం జీఓ నంబరు 199 విడుదల అయింది. ఈ నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ప్రభుత్వం నిధులను విడుదల చేయడం పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పురపాలక శాఖ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

# వామ్మో.. మూటలు..!

- యర్రంపల్లి వద్ద కలకలం
- రైల్వేట్రాక్ పక్కన వెలుగులోకి..
- ఉరుకులు, పరుగులు పెట్టిన పోలీసులు
- మేకల కళేబరాలు బయటపడడంతో ఊపిరి పీల్చుకున్న వైనం


పరిశీలిస్తున్న రామగిరి సీఐ శ్రీధర్, సిబ్బంది

చెన్నేకొత్తపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రంపల్లి వద్ద సోమవారం దుర్వాసన వెదజల్లుతూ రైల్వేట్రాక్ పక్కన, వంతెన కింద పడి ఉన్న మూటలు కలకలం రేపాయి. రైల్వే, స్థానిక పోలీసులను ఉరుకులు, పరుగులు పెట్టించింది. ఎర్రంపల్లి సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన మూడుచోట్ల వేర్వేరుగా ప్లాస్టిక్ సంచి మూటలు పడి ఉన్నాయి.ఒక్కో మూట మధ్య అర కిలోమీటరు మేర దూరం ఉంది. రైతులు.. తోటల వద్దకు వెళ్తుండగా దుర్వాసన వచ్చింది. దగ్గరికి వెళ్లి చూడగా ప్లాస్టిక్ సంచితో కూడిన మూటలు పడి ఉన్నాయి. రైల్వే వంతెన కింద ఒకటి, మిగిలిన రెండు మూటలు దూరదూరంగా ట్రాక్ పక్కన గుంతలో పడేశారు. అనుమానం వచ్చి రైల్వే, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం రైల్వే సీఐ అశోక్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్ అక్కడికి చేరుకుని, మూటలను పరిశీలించారు. అనంతరం ఒక్కొక్కటిగా మూటలను తెరిపించగా కుళ్లిపోయి పురుగులు పట్టిన మేకలు, వాటి పిల్లల కళేబరాలు బయటపడ్డాయి. దీంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. వ్యాధులు సోకి మృతిచెందిన వాటిని గుర్తుతెలియని కాపరులు సంచుల్లో మూట కట్టి ఇక్కడ పడేసి ఉంటారని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

## శిక్షణతో ఉద్యోగావకాశాలు మెరుగు

- జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

అనంతపురం సెంట్రల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శిక్షణతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగు పడతాయని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీలో ఆప్టిట్యూడ్, రీజనింగ్‌పై విద్యార్థులకు శిక్షణ సోమవారం ముగిసింది. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి.. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి, మాట్లాడారు. కళాశాల నుంచే ఉద్యోగాలు సాధించేలా ఎంటెక్, ఎంసీఏ విద్యార్థులకు ప్రథమ సంవత్సరంలోనే ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోజువారీ పాఠ్యాంశ బోధనతోపాటు సెలవు రోజుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు హ్యాండ్‌బాల్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 19వ తేదీన అనంతపురంలోని న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివశంకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 2005 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 20వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 8978137522, 7013572439 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# డ్వామాలో బదిలీల సందడి..!

- వేర్వేరుగా నిర్వహణ
- హెచ్‌ఆర్‌లో మాయ
- సిఫారసు కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ
- రేపు కౌన్సెలింగ్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): డ్వామాలో బదిలీల ప్రక్రియ మొదలయింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపడుతున్నారు. మొదట ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయాలని సూచించినా.. తరువాత అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు వేర్వేరుగా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. సోమవారం సాయంత్రం వరకు బదిలీల ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో మూడేళ్లు పూర్తయిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. ఇందులో ఏపీఓలు 11 మంది, టీఏలు 98 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 51 మంది బదిలీల ఆప్షన్లు పెట్టుకున్నారు. కొంతమంది ఉద్యోగులకు మూడేళ్లు పూర్తయినా, ఎనిమిదేళ్లు ఒకే స్థానంలో పనిచేస్తున్నా.. బదిలీల జాబితాలో పేర్లులేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈనెల 20వ తేదీన ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్, 22లోపు ఆయా బదిలీల స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### 160 మంది బదిలీకి ఆప్షన్లు

డ్వామాలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం ఉద్యోగులు బదిలీ ఆప్షన్ల ప్రక్రియ ముగిసింది. మూడేళ్లు పూర్తయిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. ఇందులో ఏపీఓలు 11 మంది, టీఏలు 98 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 51 మంది బదిలీల ఆప్షన్లు పెట్టుకున్నారు. బదిలీల ఆప్షన్లలో ఈసీలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వీరిలో గుత్తి ఏపీడీ అసిస్టెంట్ ఎనిమిదేళ్లు, బుక్కరాయసముద్రం ఏపీడీ అసిస్టెంట్ ఏడేళ్లు, హెచ్‌ఆర్ విభాగంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఎనిమిదేళ్లు, రాప్తాడు నియోజకవర్గంలోని ఓ మండలంలో పనిచేస్తున్న ఏపీఓ ఐదేళ్లు, కూడేరులో ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఐదేళ్లు పూర్తి చేసుకున్నా బదిలీల జాబితాలో పేర్లు లేకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా హెచ్‌ఆర్ విభాగం ప్రభావమేనని తెలుస్తోంది. దీని వెనుక ముడుపులు ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.


ఆప్షన్ల నమోదుకు డ్వామా కార్యాలయంలో ఉద్యోగుల హడావుడి

### సిఫారసు లేఖల కోసం పాట్లు

డ్వామాలో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీలకు సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మొదట ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తర్వాత విభజన జిల్లాల్లో కలెక్టర్, డ్వామా పీడీలే బదిలీలు చేపట్టాలని పేర్కొంది. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు వేర్వేరుగా బదిలీలు ప్రారంభించాయి. బదిలీల కోసం ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను జత చేసి ఆప్షన్లు ఇస్తున్నారు. ఉద్యోగుల బదిలీల ఫైల్ కలెక్టర్‌కు చేరింది. ఫైల్‌తో పాటు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను చూసిన కలెక్టర్ ఆశ్చర్యపోయినట్లు సమాచారం. బదిలీ ఉద్యోగుల సంఖ్య కంటే సిఫారసు లేఖలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

### పారదర్శకంగా బదిలీలు

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నాం. మొదట ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీ చేపట్టాలని నిర్ణయించారు. తరువాత విభజన జిల్లాల వారీగా ఉద్యోగుల ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు బదిలీ ఆప్షన్లు తీసుకున్నాం. ఇందులో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈసీలు ఉన్నారు. మూడేళ్లు పూర్తయిన ఉద్యోగులు కచ్చితంగా బదిలీ కావాల్సిందే. ఇదే నిబంధనలతోనే బదిలీలు పూర్తి చేస్తాం.

- సలీంబాషా, పీడీ, డ్వామా

## రైతు రథాలు ఇవ్వాలి

### పథకం పునరుద్ధరణకు ప్రభుత్వ విప్ కాలవ విజ్ఞప్తి


అసెంబ్లీలో మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్నదాత అవసరాలకు అనుగుణంగా మండలానికి 50 రైతు రథాలు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విన్నవించారు. అసెంబ్లీలో సోమవారం రైతు సమస్యలపై ఆయన మాట్లాడారు. టీడీపీ పాలనలో రైతు రథం పథకం ద్వారా సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ చేశామన్నారు. తిరిగి ఆ పథకాన్ని పునరుద్ధరించి, రానున్న ఏడాది నుంచి మండలానికి కనీసం 50 ట్రాక్టర్లు మంజూరు చేయాలని కోరారు. టీడీపీ హయాంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. రైతుల సౌకర్యార్థం 113 పథకాలు అమలు చేశామన్నారు. తరువాతి వైకాపా ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి రైతాంగానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. మైక్రో ఇరిగేషన్ కింద డ్రిప్, స్ప్రింక్లర్లపై కేంద్రం సబ్సిడీ రూపంలో ఇచ్చిన నిధులు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. దీంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే రాయలసీమ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. పండ్ల తోటల సాగుపై ఎక్కువ ఆధారపడ్డ సీమ రైతులు సాగునీటి కొరత వల్ల డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవసాయం చేస్తున్నారన్నారు. సీమ అనావృష్టి పరిస్థితులను గుర్తించి పదెకరాల మెట్ట కంటే ఎక్కువున్న రైతులకు కూడా నిబంధనలు సడలించి 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇవ్వాలని సంబంధిత మంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు.

## ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ముగ్గురిపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు, సిద్దు అనే యువకుడు, ఓ బాలిక ప్రేమించుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఆధారంగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సిద్దు ఇంటికి వెళ్లి మందలించారు. ఆ సమయంలో ఇంట్లో లేని సిద్దు, తరువాత మరో ఇద్దరితో కలిసి బాలిక ఇంటి వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దుతోపాటు అతనికి సహకరించిన సాయి, వెంకటేశ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## చేనేతకు ఉచిత విద్యుత్

- రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం

పుట్టపర్తి, మార్చి17(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలంలో సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. జిల్లాలో వ్యవసాయం తరువాత అత్యధికంగా జీవనోపాధినిస్తున్న చేనేత రంగాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. చేనేత కార్మికుల గృహాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. దీంతో జిల్లాలో 33,274 మంది చేనేత కార్మికులు, పదివేలదాకా పవర్ లూమ్స్ యూనిట్లకు లబ్ధిచేకూరనుంది. పరిశ్రమలు, వాణిజ్య ప్రాజెక్టులను వేగవతం చేసే దిశలో ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 కింద అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో 4000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులను (ఎంఎస్ ఏపీ ఎన్‌జీఈఎల్ హరిత్ అమృత్ లిమిటెడ్) ఏర్పాటు చేయడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం) | సహర్ (బుధవారం ఉదయం) |
|---|---|---|
| కదిరి : | 6.31 | 5.06 |
| ధర్మవరం : | 6.33 | 5.02 |

## న్యూస్ బాక్స్

### ఉద్యోగ భద్రత కల్పించాలి

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ 20 ఏళ్లగా పని చేస్తున్నారిన, రీచార్జ్ మీటర్లు వస్తున్న క్రమంలో వారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. కావున మంగళవారం ట్రాన్స్-కో డీఈ కార్యాలయం ఎదుట, గురువారం ఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా, 24న కలెక్టర్‌కు వినతి పత్రం, 27న సీఎండీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. వీరికి ఏఐటీయూసీ నాయకుడు ఎర్రం శెట్టిరమణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముపుగు మధు మద్దతు ప్రకటించారు. ఈ నిరసనలో మీటర్ రీడర్ జిల్లా కోశాధికారి బీసీ దస్తగిరిరాజు, నాయకులు జగదీశ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుడికి నివాళి



నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

తాడిమర్రి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకవారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తమ్మినేని రమేశ్‌నాయుడు ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెల్సిందే. సోమవారం ఉదయం తురకవారిపల్లి గ్రామంలో ఆయన మృతదేహానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. రమేశ్ కుమార్తె శిరివల్లి ఉన్నత చదువులకు టీడీపీ, కుటుంబసభ్యులకు తాము అండగా ఉంటామన్నారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, నాయకులు గోనుగుంట్ల భూషణ్, జనార్దన్ పతకమూరి, కేశవరెడ్డి, రమణ, శ్రీనివాసులు, అశ్వర్థ, పిన్నదరి నరసింహ, కొడెదలసాయి, హర్షవర్దన్ ఉన్నారు.

### 25లోపు పన్నులు చెల్లించండి

కదిరి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 25లోపు ఇంటి, ఖాళీ స్థలం, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్సుల రుసుం చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కానీ, సమీపంలోని సచివాలయంలో కాని పన్నులు చెల్లించాలన్నారు. సెలవు రోజుల్లో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఉంటుందన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

### బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



భాస్కర్‌నాయక్, లిఖిత్‌నాయక్

నల్లమాడ, మార్చి 17(ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భాస్కర్‌నాయక్, 8వ తరగతి చదువుతున్న లిఖిత్ నాయక్ బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటారు. వీరు రాష్ట్ర జట్టు తరపున పంజాబ్ రాష్ట్రం సంగ్రురూర్‌లో ఈనెల 27 నుంచి 31 వరకు నిర్వహించే జాతీయ స్థాయి అండర్ 14 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వార్డెన సత్యనారాయణ సోమవారం తెలిపారు. వీరికి జిల్లా గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రావు, హెచ్‌ఎం సతీష్, కావేరి, పీడీ ధరణీ అభినందించారు.

### బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్రనగర్‌లో నివాసముంటున్న మంగళ లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మదీన మసీదు కమిటీ, మదీనా వెల్ఫేర్ సభ్యులు అతనికి రూ.10వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మదీన మసీదుముతవల్లి నాగూర్ హుస్సేన్, అయూబ్‌ఖాన్, టింకర్‌రాజా, ఇఆహి, చాంద్, అల్తాఫ్, సలీం, అమీర్ పాల్గొన్నారు.

### నిరుపయోగంగా 'గోపాలమిత్ర' భవనం

ధర్మవరంరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శినమలలో గోపాలమిత్ర పశువైద్యశాల భవనం దాదాపు ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో రూ. ఏడు లక్షలతో పాడిపశువులకు వైద్యచికిత్సలు అందించేందుకు ఈ భవనాన్ని నిర్మించారు. అప్పట్లో కొన్నిరోజులు వాటిలో గోపాలమిత్రలు ఆ భవనంలో ఉంటూ.. పాడిపశువులకు వైద్య సేవలు అందించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతో గ్రామ పశుసంవర్ధకశాఖ అధికారులు సచివాలయంలో ఉంటూ.. వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. దీంతో ఐదు సంవత్సరాలుగా ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా నూతన పాలకులు.. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఈ భవనంలో పాడిపశువులకు వైద్యచికిత్సలు అందేలా.. లేక ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



దర్శినమలలో నిరుపయోగంగా ఉన్న గోపాలమిత్ర పశువైద్యశాల భవనం

# ఎప్పుడు పూర్తయ్యేనో..?



శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీ భవనం



వైసీపీ హయాంలో ఆగిన ఆసుపత్రి భవన నిర్మాణం

**ఆగిన ముదిగుబ్బ పీహెచ్‌సీ భవన నిర్మాణం**
**టీడీపీ హయాంలో ప్రారంభం**
**పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం**
**పాత భవనంలోనే అరకొర సేవలు**
**మంత్రి సత్యకుమార్ హామీ నిలబెట్టుకునేనా..?**

ముదిగుబ్బ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. అందులోనూ ఆ భవనం చిన్నదిగా ఉండటం.. ఆధునిక వైద్య సేవలు అందించడానికి అది సరిపోదు. దీంతో గత టీడీపీ ప్రభుత్వం రూ.90 లక్షలతో నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు శ్లాబ్ వరకూ పూర్తయ్యాయి. అనంతరం అధికా రంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిర్మాణానికి ఒక పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో ఆ భవన నిర్మాణం ఆగిపోయింది. నేటికీ ఆ భవన నిర్మాణం మొండి గోడలతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. నేడు మళ్లీ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి.. ఆధునిక వైద్య సేవలు అందుతాయని మండల వాసులు ఆశలు పెంచుకున్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేస్తామని, సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండటంతో 30 పడకల ఆసుపత్రిని త్వరగతిన ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● వైసీపీ నిర్లక్ష్యం ..

పీహెచ్‌సీ భవన నిర్మాణం శ్లాబ్ వరకు పూర్తి అయింది. మరికొన్ని నిధులు మంజూరు చేస్తే భవన నిర్మాణం పూర్తి అయ్యేది. అయితే వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పాత పీహెచ్‌సీ భవనానికే వైసీపీ రంగులు వేయించి.. చేతులు దులుపుకుంది. దీంతో పెచ్చులు ఊడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఆ భవనంలోనూ వైద్యులు అరకొరగా సేవలు అందిస్తున్నారు. ఆ భవనంలో తాగునీరు, మరుగు దొడ్లు.. తదితర కనీస సౌకర్యాలూ లేవు. రోగులు కూర్చొడానికి బెంచీలు లేవు. అంతేకాకుండా ఈ వైద్యశాల కేవలం ప్రాథమిక చికిత్సలకే పరిమి తమైంది. ఏదైనా ప్రమాదం జరిగినా.. అత్యవసర చికిత్స కోసం కదిరి, బత్తలపల్లి, అనంతపురానికి వెళ్లాల్సిందే. ఇలా అనేక మంది అత్యవసర చికిత్సలు అందక.. మార్గ మధ్యలోనే మరణించారు. మండల ప్రజలు చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం కదిరి, బత్తలపల్లి, అనంతపురం వెళ్లాల్సి వస్తోంది.

### మెరుగైన వైద్యం అందాలి



నిత్యం వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలి. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు కూడా కదిరి, బత్తలపల్లి, అనంతపురానికి వెళ్లాల్సి వస్తోంది. వెంటనే ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు మంచి వైద్య సేవలు అందించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నాగేంద్ర, ఉప్పలపాడు

### ప్రథమ చికిత్సతో సరి



ఈ ఆస్పత్రి కేవలం ప్రథమ చికిత్సలు అందించడానికే పరిమితమైంది. ప్రాణాపాయ.. అత్యవసర స్థితిలో పీహెచ్‌సీకి వచ్చినవారికి తగు వైద్య సేవలు అందడం లేదు. ఆ సమయంలో వాళ్లను వేరే ఊర్లకు తీసుకొని వెళ్లాల్సి వస్తోంది. సమీపంలోని ఆధునిక వైద్యశాలకు వెళ్లేలోపే వారి చనిపోతున్నారు. వెంటనే ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి, అత్యవసర.. ఆధునిక వైద్యం అందించాలి.

- సూర్యనారాయణరెడ్డి, మర్తాడు

# అక్రమాలపై విచారణ చేపట్టాలి



ధర్మవరం : తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకుల నిరసన



పుట్టపర్తి : ముదిగుబ్బ ఎంపీపీపై జేసీకి ఫిర్యాదు చేస్తున్న తండావాసులు

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో 650-2 సర్వేనెంబరులో ఫ్లంబర్స్ సంఘం పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి ముసుగు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ నాయకులు, ఫ్లంబర్స్ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. పేదల పేర్లు చెప్పుకుని కొందరు ఫ్లంబర్స్ సంఘం నాయకులు రూ.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని బినామీ పేర్లతో నొక్కేశారన్నారు. దీనిపై విచారణ చేపట్టి.. అవినీతికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

● కార్మికుల సమస్యలపై..

స్వచ్ఛభారత్ కార్మికులు, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ ఆర్డీఓ మహేశ్‌కు విన్నవించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, వారి వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

● ముదిగుబ్బ ఎంపీపీపై ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్: తరతరాలుగా తాము సాగుచేసుకుంటున్న భూములను ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, ఆయన కుటుంబ సభ్యులు అక్రమంగా కబ్జా చేశారని ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లితండాకు చెందిన పలువురు గిరిజనులు వాపోయారు. ఈ మేరకు సోమవారం జేసీ అభిషేక్ కుమార్‌కు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. తమకు భూములను అక్రమంగా వన్‌బి రికార్డులోకి నమోదు చేయించుకుని, బ్యాంక్‌లో రుణాలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో బంజార గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసనాయక్, రవీంద్రానాయక్, రాజేంద్ర, బాలు, రాజేష్, సీపీఐ అంజనేయులు, చలపతి, నారాయణస్వామి, చంద్ర పాల్గొన్నారు.

● చెరువులు కబ్జా

నంబులపూలకుంట: ఎన్పీకుంట పంచాయతీలోని దేవరచెరువు, పెద్దచెరువు, గొకనపేట చెరువు, ధనియాన్‌చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని సీపీఐ నాయకులు రమణ, గంగులప్ప, ఆదిలక్ష్మీ సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. చెరువు విస్తీర్ణం తగ్గిపోవడంతో నీటి నిల్వ తగ్గుతుందని, సాగునీరుతోపాటు, పశువులకు నీరు కొరత ఏర్పడుతుందని అన్నారు.

● శ్మశాన వాటికను అభివృద్ధి చేయండి

తనకల్లు: మండలంలోని చీకటిమానుపల్లిలో శ్మశానవాటికకు ఉపాధి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారేసు, చంద్రప్ప ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కోరారు. స్పందించిన ఎంపీడీఓ రెడ్డెప్ప తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

● వెలగని వీధి దీపాలు..

తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్‌లో జాతీయ రహదారిలోని వీధిదీపాలు వెలగడం లేదని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకుడు రెడ్డెప్ప తహసీల్దార్ శోభాసువర్ణమ్మను విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

● వీఆర్వోపై ఫిర్యాదు

గాండ్లపెంట: మండలంలోని గొడ్డివెలగల రెవెన్యూ వీఆర్వో జయరాం పనితీరుపై గ్రామస్థులు, మాజీ సర్పంచ్ ప్రసాద్ సోమవారం తహసీల్దార్ బాబురావుకు ఫిర్యాదు చేశారు. కొత్త పాస్‌పుస్తకాల తయారీ, ఇతర సమస్యలపైన వీఆర్వో వద్దకు వెళ్లితే పట్టించుకోలేదన్నారు. అలాగే రేషన్ పంపిణీ సక్రమంగా జరగలేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

### ఎస్పీకి 50 ఫిర్యాదులు

పుట్టపర్తి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మొత్తం 50 ఫిర్యాదు వచ్చినట్లు ఎస్పీ వీ రత్న తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉద్యోగం పేరుతో మోసం..

ముదిగుబ్బ మండలం పొడరాళ్ళపల్లికి చెందిన నంబూరి వెంకటనారాయణ ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి రూ. 3.50 లక్షలు తీసుకున్నారని అదే మండలంలోని పూజారి తండాకు చెందిన రమావత్ లాలూనాయక్ వాపోయాడు. ఈ మేరకు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. డబ్బులు అడిగితే దాడి చేస్తున్నాడని వాపోయాడు.



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

# చేనేతలకు బడ్జెట్‌లో అన్యాయం

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందంటూ చేనేత కార్మిక సంఘం కార్మికులు స్థానిక కళాజ్యోతి సర్కిల్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడగ వెంకటనారాయణ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ.2 వేలు కోట్లు కేటాయించి ఆదుకోవాలన్నారు. ధర్మవరంలో చేనేతల ఆత్మహత్యలు, వలసల నివారణకు, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నంపల్లి శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, శ్రీధర్, బాలరంగయ్య, కొండ, పెద్దకోట్ల గణేశ్, కేశవ, రమణ, మల్లికార్జున, రమేశ్ పాల్గొన్నారు.




చేనేత కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

# సమయ పాలన గాలికి..!

**ఉదయం 10.30 అయినా విధులకు రాని పట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి**

కదిరి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి ప్రమీళ సమయ పాలన పాటించడంలేదు. సోమవారం ఉదయం 10.30 గంటలైనా ఆమె విధులకు హాజరుకాక పోవడంతో రోగులు ఆమె కోసం నిరీక్షించారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషియల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై వైద్యాధికారి ప్రమీళను ఫోన్ ద్వారా సంప్రదించగా తాను ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వెళ్లానని, అందుకు విధులకు ఆలస్యమైందని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ పోలప్పను సంప్రదించగా.. వైద్యాధికారిణి ప్రమీళ పరిష్కార వేదికకు హాజరుకాలేదన్నారు. దీనిపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్‌ను సంప్రదించగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



వేచి ఉన్న రోగులు, ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ (ఇన్‌సెట్లో)

### వీధుల్లోకి మురుగు నీరు వదలకండి

గాండ్లపెంట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలోకి మురుగునీటిని వదలరాదని గృహ యజమానులకు పంచాయతీ అధికారులు సోమవారం సూచించారు. అధికంగా నీటిని వదులుతున్న వారికి నోటీసులు ఇచ్చారు. పలువురు ఇలా రోడ్లపైకి మురుగునీరు వదులుతుండటంతో.. రోడ్లు దెబ్బతింటున్నాయని, అందుకు నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యదర్శులు బాషా, మదన్‌కుమార్, శ్యామ్‌కుమార్ చెప్పారు. ఇకపై నీరు బయటకు వదిలితే వారికి జరిమానా విధిస్తామన్నారు.

## క్రైం న్యూస్..

### ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

తనకల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలయ్య గారిపల్లి సమీపంలో రైతు చంద్రారెడ్డి బోరువద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి.. అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. శనివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన చంద్రారెడ్డి.. విషయాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు.. సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు. ఈ బోరుకింద మూడు ఎకరాల్లో చిక్కుడు పంట సాగుచేశానని, నాలుగు రోజులకు ఒకసారి తడులు ఇవ్వాల్సి ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో పంటకు నీరు ఇవ్వలేదని రైతు చంద్రారెడ్డి వాపోయాడు. అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

### డ్రిప్ పరికరాలు ..

ఓబుళదేవరచెరువు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో పుంగనూరు భాస్కర్‌రెడ్డి పొలంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు చోరీ చేశారు. తాను మూడు ఎకరాల్లో వేరుశనగ, ఒక ఎకరాలో టమోటా సాగు చేశానని, పదిరోజుల్లో వేరుశనగ పంట చేతికొచ్చే సమయంలో డ్రిప్, స్ప్రిక్లర్లు చోరీకి గురయ్యాయని భాస్కర్‌రెడ్డి వాపోయాడు. దీంతో తనకు రూ.30 వేలు నష్టం జరిగిందన్నారు. వారం రోజుల క్రితం ఎకరా పొలంలో నాటిన టమోటా మొక్కలను పీకేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

### మెకానిక్ షాప్‌లో ..

ముదిగుబ్బ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి రోడ్డులో ఉన్న ఎలక్ట్రికల్ మెకానిక్ షాప్‌లో చోరీ జరిగింది. కదిరి రోడ్డులో ఓ రేకులషెడ్డులో మెకానిక్ సూరి మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే సూరి ఆదివారం రాత్రి షాప్ మూసివేసివెళ్లాడు. సోమవారం ఉదయం షాప్ తెరచి చూడగా.. షాపు వెనుక వైపు ఉన్న రేకును తొలగించి, షాప్‌లో ఉన్న గ్రైండర్ మోటర్, రెండు కటింగ్ మిషన్‌లు, రిపేరుకు వచ్చిన మోటర్లు, ఒక బాక్స్ కాపర్ వైరు, ఇతర విలువైన సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. వాటి విలువ దాదాపు 30 వేలు ఉంటుందన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

### తోపుదుర్తీ.. నోరు అదుపులో పెట్టుకో..!

**బీసీలను చులకన చేస్తే సహించం**
**టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ**



మాట్లాడుతున్న బీసీ నాయకులు

పుట్టపర్తిరూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న రామగిరి పోలీసుస్టేషన్ ఎస్ఐని పట్ల దుర్భాషలాడిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నోరు అదుపులో ఉంచుకోవాలని... మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాయిఆరామంలో ఆయన బీసీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీ అధికారులను ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడటం తగదన్నారు. రామగిరి ఎస్ఐకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి బీసీలను చులకన చేసి మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నాయకులు ఉమాపతి యాదవ్, పల్లాకిరణ్ యాదవ్, భూమిగాని రామాంజినేయులు, రాజశేఖర్ యాదవ్, భాస్కర్‌బాబు, డేరంగుల నారాయణ, చాకలిశివప్ప, వెంకటేష్‌యాదవ్, ఆదినారాయణ, బత్తినచిన్నప్ప పాల్గొన్నారు.

### సజావుగా పది పరీక్షలు

ధర్మవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు సజావుగా సాగాయి. మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో 2,443 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2,430 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ-1, రాజేశ్వరి, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద డీఎస్పీ హేమంత్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను పోలీసులు అమలు చేశారు.

న్యూస్ బాక్స్

## వేణురెడ్డిని కఠినంగా శిక్షించాలి


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెచ్చగొట్టే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడు వేణురెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. అతనిపై కేసు నమోదుచేసి చట్టపరంగా శిక్షించాలని సోమవారం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, నాయకులు కలిసి వెళ్లి డీఎస్పీ మహేష్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వేణురెడ్డి మీడియా ముందు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. ఇది టీడీపీ నాయకుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రెస్‌వెంకటేశ్, బాచి, నెట్టప్ప, ఎన్‌బీకే ఫ్యాన్స్ సతీష్, కౌన్సిలర్ సతీష్, సర్పంచ్ మంజునాథ్, యుగంధర్, అమీన్, నవీన్, అంజాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పాఠశాల విలీనం ఆపండి


డీటీకి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

చిలమత్తూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కొత్తచామలపల్లి, సంజీవరాయునిపల్లి గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను పాతచామలపల్లిలోని పాఠశాలలోకి విలీనం చేసే పనులు ఆపాలని ఏఐడీఎస్ఓ నాయకులు, పిల్లల తల్లిదండ్రులు కోరారు. సోమవారం ఆ సంఘం నాయకులు సురేష్, పూజిత, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథంకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కొత్తచామలపల్లి నుంచి, సంజీవరాయునిపల్లి పాతచామలపల్లికి వెళ్లాలంటే చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వెంటనే పాఠశాల విలీనం ఆపాలని వారు కోరారు.

## కార్మికుల కుటుంబాలను ఆదుకోండి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న ముత్యాలు, నరసింహులు ఇటీవల మృతిచెందారని, వీరి కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం బాబావలి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి, లక్ష్మీనారాయణ, వెంకటేష్, మృతుల కుటుంబ సభ్యులు కమిషనర్‌కు వినతిని అందించారు. మృతిచెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. స్పందించిన కమిషనర్ కార్మికుల భార్యలకు ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్ త్వరితగతిన అందజేస్తామని హామీ ఇచ్చారు.

## పింఛన్ల పంపిణీకి 184 డివైజ్‌ల పంపిణీ


సచివాలయ సిబ్బందికి డివైజ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు

గోరంట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సజావుగా సాగడానికి ప్రభుత్వం 184 డివైజులు మంజూరు చేసిందని అధికారులు తెలిపారు. మండలంలో సిబ్బంది వద్ద సరైన డివైజులు లేక పలువురు సెల్‌ఫోన్ ఫొటోనుంచి, ఐరీష్ ద్వారా పింఛన్ల పంపిణీకి నానా తంటాలు పడుతున్నారు. సమస్య గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ సిబ్బందికోసం పెద్ద ఎత్తున డివైజ్‌లు సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాయలంలో అధికారులు నవీన్, నీరంజన్‌రెడ్డి, సతీష్‌కుమార్‌లు కార్యదర్శులు, వెలుగు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బందికి డివైజ్‌లను సోమవారం అందించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుభకల్యాణి

పావగడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేషన్ డిపోలను, తాలూకా పరిధిలోని శ్రీరంగపురం తండాలో అంగనవాడీ కేంద్రాలను కలెక్టర్ శుభకళ్యాణి సోమవారం పరిశీలించారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం సరైన పద్ధతిలో అందుతుందా లేదా అనే అంశంపై ఆమె పరిశీలించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లలతో ముచ్చటిస్తూ అంగనవాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉండి పచ్చదనంతో కళకళలాడుతోందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జేజేఎం పనులు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ రాష్ట్రంలో జరుగుతున్న నూతన సోలార్‌పార్కుకు సంబంధించి భూములను పరిశీలించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డైరెక్టర్ చేతన్, కుమార, తహసీల్దార్ వరదరాజు, సీడీపీఓ సునీత, టీహెచ్ఓ కిరణ్, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

## పోలీసులకు సీపీఐ నాయకుల ఫిర్యాదు

గోరంట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకులను కించపరుస్తూ మాట్లాడిన పసుపులేటి రమేష్‌బాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ పార్టీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, మండల కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ శేఖర్‌ను కలిశారు. అమడగూరు మండలంలోని తనకంటివారిపల్లికి చెందిన రమేష్‌బాబు సీపీఐ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు, పార్టీ సభ్యులు, పార్టీని కించపరుస్తూ మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీపీఐ రామక్రిష్ణ, వెంకటేష్, క్రిష్టప్ప, నారసింపల్లి క్రిష్టప్ప, మహేష్ పాల్గొన్నారు.

# ఇన్‌చార్జిలే దిక్కు..!

● రెగ్యులర్ ఉద్యోగులు లేక అవస్థలు
● కుంటుపడుతున్న పాలన
● ప్రజలకు అందని మెరుగైన సేవలు



చిలమత్తూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొంత కాలంగా ఇన్‌చార్జి అధికారుల పాలన సాగుతోంది. దాంతో మెరుగైన సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో పలు పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజాసేవలకు తీవ్ర ఇబ్బందులు కులుగుతున్నాయి. ఖాళీ అయిన పోస్టులకు కొత్తవారు ఎవరూ రాకపోవడంతో సమస్య జఠిలమైందనే చెప్పాలి. రెండేళ్లుగా రెగ్యులర్ ఎంపీడీఓలు అటుగా వస్తూ ఇటుగా వెళుతున్నారు. కనీసం నెల రోజులు కూడా పనిచేయడం లేదు. దాంతో రెండేళ్లుగా ఎంపీడీఓ పోస్టు ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా రెగ్యులర్ ఎంపీడీఓలు రాకపోవడంతో ఏడాదిగా ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉంది. దాంతో మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రమణమూర్తి ఎంపీడీఓ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అనంతరం రెగ్యులర్ తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఆయన రెండు నెలలు పనిచేయగానే ఉద్యోగోన్నతి రావడంతో ప్రస్తుతం పెనుకొండ ఆర్డీఓగా వెళ్లిపోయారు. దాంతో రెగ్యులర్ తహసీల్దార్ రాకపోవడంతో కార్యాలయంలో పనిచేస్తున్న రీసర్వే డీటీకి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆయన కేవలం ఐదు నెలల్లో విపరీతమైన అక్రమాలు చేయడంతో సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. దాంతో మరోసారి హిందూపురం తహసీల్దార్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

### రెండేళ్లుగా ఆర్‌ఐ పోస్టులు ఖాళీ

నిత్యం ప్రజాసమస్యలు వచ్చే రెవెన్యూ శాఖలో ఇలా సంవత్సరాలుగా పోస్టులు ఖాళీగా ఉండటం, లేదా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతుండటంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావట్లేదని వాపోతున్నారు. ప్రధానంగా రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో పాటు ఇద్దరు ఆర్.ఐ పోస్టులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. దాంతో ప్రతి చిన్న విషయానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టాదార్ పాసుపుస్తకాల మంజూరు, ధ్రువీకరణ పత్రాల జారీ వంటి ఇతరత్రా పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆర్‌ఐలు లేని కారణంగా ఇష్టానుసారంగా రెవెన్యూలో అక్రమాలు జరిగాయని చెప్పవచ్చు. రెవెన్యూలో క్షేత్రస్థాయిలో ఉండాల్సిన వీఆర్వోలు, ఆర్‌ఐల ప్రమేయం లేకుండానే రికార్డుల చేర్పులు, మార్పులు యథేచ్ఛగా జరిగిపోయాయి. దాంతో ప్రజలకు సమస్యలు పెరిగిపోయాయని చెప్పవచ్చు. కనీసం రెండు సంవత్సరాలుగా ఆర్‌ఐ పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని కారణంగానే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అడ్డగోలుగా రికార్డుల గోల్‌మాల్ జరుగుతున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది.

### 12 పంచాయతీలకు ఆరుగురు కార్యదర్శులు

గ్రామ పంచాయతీ కార్యదర్శుల విషయానికి వస్తే కొన్నేళ్లుగా మండలంలో కార్యదర్శుల కొరత తీవ్రంగా ఉంది. దాంతో మండలంలో ఉన్న 12 పంచాయతీలకు కేవలం ఆరుగురు కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. ఒక్కో కార్యదర్శి రెండు నుంచి మూడు పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా పంచాయతీల పర్యవేక్షణ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. దాంతో సోమఘట్ట పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్‌కి అదనంగా ఈఓఆర్డీ బాధ్యతలు అప్పగించారు. మేజర్ పంచాయతీగా ఉన్న చిలమత్తూరు పంచాయతీయకి రెగ్యులర్ కార్యదర్శి లేరు. దాంతో పక్క పంచాయతీల కార్యదర్శులే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. దీని కారణంగా పంచాయతీలో ఇటీవల పెద్ద ఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగింది. అయినా వీరాపురం రెగ్యులర్ కార్యదర్శిగా పనిచేస్తున్న సావిత్రమ్మను చిలమత్తూరు పంచాయతీకి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. కోడూరు పంచాయతీకి కార్యదర్శిగా పనిచేస్తున్న భాస్కర్‌కి శెట్టిపల్లి, డిపి తండా పంచాయతీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా కొడికొండ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నాగేంద్రకు అదనంగా టేకులోడు, దేమకేతేపల్లి పంచాయతీలు అప్పగించారు. మొరసనపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న రామ్లానాయక్‌కు చాగలేరు పంచాయతీని అప్పగించారు. దీంతో పని ఒత్తిడి తట్టుకోలేక కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## పెరిగిన పంచాయతీ ఆదాయం

లేపాక్షి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రతియేడాది లేపాక్షి పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే పార్కింగ్, వారపుసంత వేలంపాట సోమవారం ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. బస్టాండు వేలంపాటకు 15మంది పాల్గొన్నారు. వేలంపాటలో రూ.72,10,000కు లేపాక్షి గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. వారపు సంత వేలాన్ని ఇదే గ్రామానికి చెందిన సురేష్ రూ.3.20లక్షలకు దక్కించుకున్నాడు. బస్టాండు వేలంపాట ద్వారా పంచాయతీకి ఊహించని ఆదాయం వచ్చినట్లు ఈఓఆర్డీ తెలిపారు. సర్పంచ్ ఆదినారాయణ, టీడీపీ కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆంగ్లభాషతో జీవితానికి బాటలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోపాటు ఆంగ్ల భాష ఉంటేనే జీవితానికి బాటలు వేస్తుందని ఎన్ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. సోమవారం కళాశాల విద్యార్థుల కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లీసు కోర్సును ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంగ్లభాష నేర్చుకుంటే ప్రపంచంలో ఏదేశానికి వెళ్లినా బతికేందుకు అవకాశం ఉందన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీధర్, ఆంగ్ల అధ్యాపకులు ఉపేంద్ర, రంగనాయకులు, నరసింహులు, పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

అగళి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ఆదర్శ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. వరిఖ్య 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మ్యాథమెటిక్స్, సైన్స్ కామర్స్‌కు తదితర గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 2వేల క్వింటాళ్ల చింతపండు రాక

హిందూపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు సోమవారం 2 వేల క్వింటాళ్ల చింతపండు వచ్చినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన కర్పులి మొదటి రకం రూ.30వేలు, రెండోరకం రూ.15వేలు, మూడోరకం రూ.8,200, ఫ్లవర్ మొదటి రకం రూ.12,500, రెండో రకం రూ.7వేలు, బోటురకం రూ.4500 ధర పలికింది. గత బుధవారం కంటే మేలురకం కర్పులి క్వింటాల్‌పై 3వేల దాకా తగ్గింది.

## నేడు సామాజిక తనిఖీపై గ్రామసభ

గుడిబండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. 2023-24 సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి బహిరంగ సభలో వివరాలను వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఉపాధి కూలీలకు బిల్లులు మంజూరు చేయండి

చిలమత్తూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు బిల్లులు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. కనిశెట్టిపల్లి, వడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు 9 వారాలుగా బిల్లులు అందడం లేదన్నారు. కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రవీణ్, కూలీలు ఆదినారాయణప్ప, నంజుండప్ప, నరసమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

# మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు


టిప్పర్ల ద్వారా చెరువు మట్టిని తరలిస్తున్న దృశ్యం

గోరంట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి పక్కన పాలసముద్రం చెరువు పరంబోకు స్థలంలో మట్టిని అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. దేవులచెరువు రహదారిలోని లేఅవుట్ స్థలంలో వంకను చదును చేయడానికి చెరువు మట్టిని తరలిస్తున్నారు. హిటాచీ ద్వారా 8 టిప్పర్ల సాయంతో ఉదయం నుంచి మట్టి తరలింపు చేపట్టారు. ఇందుకు కారకులైన ఫీల్డుఅసిస్టెంట్ నరేష్ తదితరులపై అభ్యంతరం తెలుపుతూ పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈఈ లక్ష్మీనారాయణ పాలసముద్రం చెరువు ప్రాంతాన్ని, యంత్రాలను, మట్టి తరలించిన ప్రదేశాలన్ని పరిశీలించి స్థానికులతో విచారించారు. అనంతరం మట్టి తరలింపునకు కారకులైనవారు, యంత్రాలపై చర్యలు చేపట్టి జరిమానా విధించాలని సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు డీఈఈ తెలిపారు. మట్టి తరలింపునకు కారకులైన ఫీల్డు అసిస్టెంట్ నరేష్, అరుణ్‌యాదవ్ తాము మంత్రి పేరుతో పనులు చేపట్టలేదని, తమ పొలాన్ని చదువ చేయడానికే టిప్పర్లతో మట్టి తోలామని విలేకర్లకు తెలిపారు.

# పది పరీక్షలు ప్రారంభం

హిందూపురం/అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్ష కావడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను వెంటబెట్టకుని పరీక్ష కేంద్రాలకు వచ్చారు. తొలిరోజు కావడంతో విద్యార్థులు ఉదయం 8-30 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. కొన్నిచోట్ల 8-45వరకు లోనికి అనుమతి ఇవ్వలేదు. కేంద్రాలవద్ద విద్యార్థులతో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీచేసిలోనికి పంపారు. హిందూపురం మండలంలో 19ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జరిగిన పరీక్షలకు 2950 మంది హాజరు కావాల్సి ఉండగా 48మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు. కేంద్రాలవద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. 673మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 668 మంది హాజరైనట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో సోమవారం పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. 506మంది ఉండగా సోమందేపల్లిలో 408 మంది తెలుగు పరీక్షను రాశారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 227మంది విద్యార్థులు పరీక్ష రాయగా క్రీస్తుజ్యోతి ప్రైవేట్ పాఠశాల సెంటర్‌లో 184మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఆంజనేయులునాయక్ తెలిపారు.

పెనుకొండ: పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని ఎ-కేంద్రంలో 140మంది, బి కేంద్రంలో 160మందికి గాను 159, శాంతినికేతన్‌లో 218మందికిగాను 217మంది, సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 122కుగాను 120, మొత్తం 640కిగాను 636మంది పరీక్షలకు హాజరయ్యారు. కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా పద్మజ, రాజేంద్రప్రసాద్, నారాయణరెడ్డి, శ్రీధర్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా వెంకటేశ్వర్లు, గోవిందనాయక్, సుజాత, రామాంజనేయులు వ్యవహరించారు.


పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


ఎంజీఎం పాఠశాల వద్ద వేచివున్న విద్యార్థులు

గోరంట్ల: పట్టణంలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించిన పదోతరగతి పరీక్షలకు సోమవారం 13మంది గైర్హాజరయ్యారు. మొత్తం 1,110మంది విద్యార్థులకు గాను తెలుగు 1,097మంది హాజరైనట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పరిగి ఎంఈఓ లక్ష్మీదేవి కేంద్రాలను తనిఖీ చేశారు.

మడకశిరటౌన్: పట్టణంలో సోమవారం పది పరీక్షలు తొలిరోజు సజావుగా సాగాయి. ఐదు సెంటర్లలో 1084 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1070 మంది విద్యార్థులు హాజరయ్యారని 14 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు.

అమరాపురం: మండల కేంద్రంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాలను తహసీల్దార్ లక్ష్మీనరసింహ తనిఖీ చేశారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు ఆయన వెంట ఉన్నారు.

రొళ్ల: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈఓ శ్రీధర్, ఎస్ఐ వీరాంజనేయులు పరిశీలించారు. గురుకుల పాఠశాలలో 197 మందికిగాను 194 మంది పరీక్షలకు హాజరయ్యారు. కస్తూరిబా పాఠశాలలో 185 మందికి గాను 183 మంది హాజరయ్యారు.

రంజాన్ వేళలు
హిందూపురం ఇఫ్తార్ : 6.34 సెహరీ : 5.10
పెనుకొండ ఇఫ్తార్ : 6.34 సెహరీ : 5.10
(మంగళవారం సాయంత్రం) (బుధవారం ఉదయం)

## అయ్యవారు రాక.. తలుపులు తెరుచుకోక..

● చెట్ల కిందే విద్యార్థులు
● విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయుడు


తెరుచుకోని పాఠశాల గది

మడకశిర రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ రామగిరి పాఠశాల ఉపాధ్యాయుడు సోమవారం విధులకు డుమ్మాకొట్టారు. దీంతో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరూ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఒంటిపూట బడులు కావడంతో పాఠశాలను ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహిస్తున్నారు. అయితే ఇద్దరు ఉపాధ్యాయులలో ఒక్కరు పదో తరగతి పరీక్షల విధులకు వెళ్లారు. మరో ఉపాధ్యాయుడు విధులకు డుమ్మా కొట్టారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తరగతుల తలుపులు తీయకపోవడంతో ఆవరణ లోని చెట్టు కింద ఉండిపోయారు. ఇది గమనించిన పాఠశాల కమిటీ చైర్మన్ సిద్దరాజు, గ్రామస్థులు విషయాన్ని ఎంఈఓ భాస్కర్‌కు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్నా ఆ ఉపాధ్యాయుడు 9.44 గంటలకు సెలవులో ఉన్నట్లు ఎంఈఓకు మెసేజ్ చేశారు. పదో తరగతి పరీక్షల విధుల్లో ఉన్నా ఎంఈఓ ఫోన్ మెసేజ్‌ను చూసుకోలేదు. 11.40కి మెసేజ్‌ను గమనించిన ఎంఈఓ ఏఆర్ రొప్పం పాఠశాల నుంచి మరో టీచర్‌ను పంపారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.


ఉపాధ్యాయుడు రాకపోవడంతో చెట్ల కింద ఉన్న విద్యార్థులు

## తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీవాసులు

అగళి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కో డిపల్లి గ్రామ పంచాయతీ ముక్కడంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి నివారించాలని ఖాళీ బిందెలతో సోమవారం ప్రజలు నిరసన తెలిపారు. నెల రోజుల క్రితం తాగునీటి కోసం బోరుబావి తవ్వగా నీరు పుష్కలంగా పడ్డాయన్నారు. అయినా మోటారు బిగించకపోవడంతో రెండు కిలోమీటర్ల వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మోటారును బిగించి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## నదికి అడ్డంగా కాలువలు తవ్విన రైతులు


ఇసుకను తరలించకుండా నదిలో అడ్డంగా కాలువలు తీసిన దృశ్యం

పరిగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలించడంతోపాటు రైతుల పొలాలవద్ద ఇసుక తోడేస్తుండటంతో బొరెడ్డిపల్లి, శాసనకోట గ్రామాల రైతులు జయమంగళి నదికి అడ్డంగా కాలువలు తీశారు. పంట పొలాల పక్కన రేయింబవళ్లు ఇసుకను తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్న ట్రాక్టర్ యజమానులకు పలుమార్లు రైతులు బోర్లకు నీరు అందడం లేదంటూ వేరేచోట ఇసుక తరలించుకోవాలని సూచించినా పట్టించుకోకపోవడంతో కాలువలు తీశారు. దీనిపై సంబంధిత అధికారులకు తెలియజేసి ఇసుక అక్రమ రవాణాను ఆపాలంటూ బొరెడ్డిపల్లి రైతులు కోరారు.

## భూ సర్వేకు రైతులు సహకరించండి

గుడిబండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే పనులకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ రామ్ భూపాల్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో రైతులతో భూ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేకు ప్రభుత్వం ఆదేశించడంతో సర్వే పనులు చేపడుతున్నామన్నారు. ఇందుకు రైతులు సహకరించి భూసర్వే చేయించుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ ఫణికిషోర్, విలేజ్ సర్వేయర్లు నాగభూషణం, వెంకటరాముడు, దేవన్న, శివశంకర్, వీఆర్ఓ తిప్పేస్వామి పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలకు అదనపు సాయం

సోమందేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు సంబంధించి లబ్ధిదారులకు అదనపు సహాయాన్ని అందిస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. గృహాలు మంజూరై పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులు ముందుకొస్తే నాలుగు విడతల్లో ప్రభుత్వ సాయం అందిస్తామన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, ఆదివాసీలకు రూ.లక్ష అదనంగా చెల్లిస్తామన్నారు.

## చింతచెట్టు నుంచి పడి వృద్ధుడి మృతి

గుడిబండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూజారిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రప్ప(62) అనే వృద్ధుడు చింతచెట్టుపైనుంచి పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం అగళి మండలం పి.బ్యాడిగెర గ్రామ సమీపంలో చింతచెట్టు ఎక్కి చింతకాయలు దులుపుతుండగా కాలుజారి కిందపడ్డాడు. చికిత్స కోసం అగళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. వృద్ధుడికి భార్య అంజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## కల్లు దుకాణం సీజ్

హిందూపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండలంలోని లక్ష్మీపురంలో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న కల్లుదుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. రామాంజనేయులు అనే వ్యక్తి లైసెన్స్‌లేకుండా కల్లుదుకాణం నిర్వహిస్తున్నాడన్నారు. అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి 30లీటర్ల కల్లు స్వాధీనం చేసుకుని అతనిపై కేసునమోదుచేసినట్లు సీఐ తెలిపారు. అలాగే మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు పృథ్వీ, ఫరూక్, సిబ్బంది పాల్గొన్నారు.